క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో 6 గేదెలకు గాయాలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం ఎస్సీ కాలనీలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఆరు గేదెలను గాయపరిచిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీ వాసులు తెలిపిన వివరాల మేరకు గతంలో పంచాయతీ సారథ్యంలో వీధి కుక్కలను పట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదని మరో గ్రామంలో బంధించిన కుక్కలను ఈ గ్రామంలో వదిలివేయటం వలన ఈ దుస్థితి వస్తున్నట్లు కాలనీవాసులు వాపోయారు. రూ.లక్షలు విలువ చేసే పాడి గేదెలపై కుక్కలు దాడి చేయటంతో ఇబ్బందులు పడుతున్నామని గేదెల యజమానులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను పట్టుకుని అడవిలో వదిలి వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కేసానుపల్లిలో కంటి వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్, రోటరాక్ట్ క్లబ్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో ఎంవీ రెడ్డి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మొద్దం సృజన వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి సమస్యలు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల చైర్మన్ రామశేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.ఫణిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న ఆదివాసీ దినోత్సవ సభ

నరసరావుపేట రూరల్: గుంటూరులో ఈ నెల 16వ తేదీన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సభను నిర్వహిస్తున్నట్టు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు గాంధీపార్క్ వద్ద బుధవారం సభ కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16న గుంటూరు బ్రాడీపేట 2వ లైన్ పరిటాల భవన్‌లో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగే సభలో రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు వడ్డె శోభనాద్రీశ్వరరావు, దండకారణ్య ఉద్యోగుల సంఘం నాయకుడు మాణిక్యం పాల్గొంటారని తెలిపారు.

మరణంలోనూ సేవా స్ఫూర్తి

నరసరావుపేట రూరల్: వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు తన మృతదేహం ఉపయోగపడాలని, తాను చదువుకున్న కళాశాల రుణం తీర్చుకోవాలని నరసరావుపేటకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ నంద్యాల కుసుమ హరనాథ బాబురెడ్డి భావించారు. మరణానంతరం తన మృతదేహాన్ని గుంటూరు మెడికల్ కళాశాలకు అప్పగించాలనే చివరి కోరికను కుటుంబ సభ్యులకు తెలియజేశారు. డాక్టర్ బాబురెడ్డి (87) బుధవారం అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహాన్ని గుంటూరు మెడికల్ కళాశాలకు అందజేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. జొన్నలగడ్డ గ్రామానికి చెందిన బాబురెడ్డి పల్నాడు బస్టాండ్‌లో కమలా నర్సింగ్ హోమ్‌ను 1966లో ఏర్పాటు చేసి ఐదు దశాబ్దాలకు పైగా వైద్య సేవలు అందించారు. ఏరియా వైద్యశాలలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో మెడికల్ ఆఫీసర్‌గా 9 సంవత్సరాలు పనిచేశారు. ఆయన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నారు. గుంటూరు మెడికల్ కళాశాలకు గురువారం తరలిస్తామని కుమారుడు డాక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కాగా కుమారుడు డాక్టర్ నర్సింహారెడ్డి, కుమార్తె డాక్టర్ శిరీష వైద్యులు కాగా, మరో కుమార్తె కమల గృహిణిగా ఉన్నారు.

ఘనంగా సాయినాథుని మందిర వార్షికోత్సవం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని సాయినగర్ షిరిడి సాయినాథుని ఆలయ 7వ వార్షికోత్సవం బుధవారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ట్రస్ట్ చైర్మన్ విజయకుమార్ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సహస్ర కలశాలతో విభూది అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రవచనకర్త డాక్టర్ నూరి నారాయణమూర్తి సాయివైభవ చరిత్రను భక్తులకు వివరించారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ విజయకుమార్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా, పట్టణవాసులే కాకుండా వేలాదిగా హాజరైన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వాగుల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



గణపవరం వద్ద కుప్పగంజి వాగులో ప్రవహిస్తున్న వరదనీరు



మాచవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఓగేరు వాగు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారుల హెచ్చరిక

నాదెండ్ల: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కుప్పగంజి వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గణపవరం నుంచి చిలకలూరిపేట డొంక రోడ్డులో చప్టాకు ఆనుకుని వరద నీరు ప్రవహిస్తోంది. బుధవారం నుంచి మరో నాలుగు రోజుల పాటు తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. వాగు ప్రవాహాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. వాగుకు పడమర వైపున తూటుకాడ, కంపచెట్లు పెరిగి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో బుధవారం రాత్రి వరద ఉధృతి పెరిగి బ్రిడ్జిపై నీరు పారే అవకాశం ఉంది. చప్టాపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. తూటుకాడను తొలగించినట్లయితే కొంతమేర ప్రవాహానికి ఆటంకం లేకుండా వరద నీరు ప్రవహించేది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. సమస్యలు ఎదురైనట్లయితే కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది భరత్ 9440036426, రాయపూడి ఫిలిప్ 9703928765, శ్యాంబాబు 9912998112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారమందించాలని కోరారు.

మండలంలో భారీ వర్షం

రొంపిచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం ఉదయానికి 52.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు చెప్పారు. భారీ వర్షాలకు తోడు సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం వలన మండలంలోని గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మాచవరం, అన్నవరం, విప్పర్లపల్లి గ్రామాల సమీపంలో ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. బెహరావారిపాలెం(దాసరిపాలెం) నుంచి మాచవరం వెళ్ళే రోడ్డుపై ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహించటం వలన రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఓగేరు వాగుపై మాచవరం గ్రామ సమీపంలో నిర్మించిన బ్రిడ్జి మీదుగా వర్షపు నీరు ప్రవహించటం వలన వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మించి ఏళ్లు గడిచి శిథిలావస్థకు చేరి భారీ వర్షాల సమయంలో దానిపై నీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వరి నారుమళ్లు వర్షపు నీటిలో మునిగిపోయాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు.

లో లెవెల్ చప్టాల వద్ద పోలీస్ కాపలా

మండలంలోని అన్ని గ్రామాల సమీపంలో గల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. మాచవరం గ్రామ సమీపంలో గల ఓగేరు వాగు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండడంతో ఈ వాగుపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవెల్ చప్టాల వద్ద రాకపోకలు నిలిపివేశామన్నారు. వాగుల వద్ద ఆయా గ్రామాల వీఆర్ఏలు, పోలీస్ సిబ్బందితో కాపలా ఏర్పాటు చేశామన్నారు.

ప్రాణాలతో బయటపడ్డ వాహనదారుడు

మాచవరం సమీపంలోని ఓగేరు వాగు కాజ్‌వే వరద ఉధృతికి వాహనదారుడు కొట్టుకుపోయాడు. రెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాలిరెడ్డి తన ద్విచక్ర వాహనంపై రూ.50 వేల రూపాయల నగదుతో నరసరావుపేటకు బయలు దేరాడు. మాచవరం సమీపంలోకి రాగానే ఓగేరు వాగుపై రాకపోకలు సాగుతున్నాయి. తాను కూడా వెళ్లవచ్చు అని వాగు మధ్యలోకి రాగానే ప్రవాహం ఉధృతమై బండితో సహా కొట్టుకుపోయాడు. అతి కష్టం మీద స్వల్పగాయాలతో ఒడ్డుకు చేరాడు. ఈ ప్రమాదంలో తన జేబులో ఉన్న విలువైన సెల్‌ఫోన్‌తో పాటు నగదు, బండి కొట్టుకుపోయాయని తెలిపాడు.

స్వాతంత్య్ర వేడుకలకు ఎన్‌సీసీ క్యాడెట్స్



టి.రాహుల్ | పి.సంజయ్ | ఎం.లహరి

నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్స్ విజయవాడలో నిర్వహించనున్న 79వ స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.రామకృష్ణరాజు బుధవారం తెలిపారు. క్యాడెట్స్ టి.రాహుల్, పి.సంజయ్, ఎం.లహరి కవాతులో పాల్గొంటారని వివరించారు. క్యాడెట్స్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీలో అధికారులు, సిబ్బంది

నూజెండ్ల: మండలంలోని పెద్దావరం గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఎంపీపీ స్కూలు విద్యార్థులు ఎస్ఎంసీ చైర్మన్ చిన ఆంజనేయులు సారథ్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు ఐక్యంగా దేశభక్తి నినాదాలతో జాతీయ పతకాలతో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ప్రదర్శించి దేశ భక్తిని చాటుకోవాలన్నారు. 15న స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నాదెండ్ల: హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో స్వరూపరాణి, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, కార్యదర్శులు మక్కెన సుబ్బారావు, సింగరాజు మారుతీబాబు, సిబ్బంది హాజరయ్యారు. 15న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. ప్రతి పౌరుడూ దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. స్థానికులకు జెండాలు పంపిణీ చేశారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డి.రేవతి బుధవారం తెలిపారు. టైప్ 3 కేజీబీవీలలో గణితం, పీఎస్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కామర్స్ సబ్జెక్ట్‌ల్లో ఒక్కొక్క పోస్ట్ ఖాళీగా ఉన్నట్టు వివరించారు. అర్హులు ఈ నెల 14 నుంచి 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440642122లో సంప్రదించాలని తెలిపారు.

వామపక్షాల క్విట్ కార్పొరేట్ ధర్నా



ధర్నాలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట ఈస్ట్: వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తుల ప్రవేశాన్ని నిరసిస్తూ బుధవారం స్టేషన్ రోడ్డులోని ధర్నా చౌక్ వద్ద వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జోరున కురుస్తున్న వర్షంలో ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను దేశ వ్యాప్తంగా నిరసిస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని దౌర్భాగ్యపు స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. కార్మిక వర్గం సృష్టించిన సంపదను, రైతాంగం పండించిన పంటలను మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దోచిపెడుతుందని దుయ్యబట్టారు. కేంద్రం తీసుకవచ్చిన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మోపుతున్న సుంకాలను వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, డి.శివకుమారి, షేక్ సిలార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, పీడీఎం రాష్ట్ర నాయకుడు వైవీ రావు, నల్లపాటి రామారావు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



చిలకలూరిపేట: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను పార్టీ నాయకులతో కలసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలులో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శతజయంతి సందర్భంగా ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో పారదర్శకత లోపించిందన్నారు. సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి బొంతా ధనరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సయ్యద్ నానా, షేక్ నన్నే, బాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు నాశనం



నరసరావుపేట టౌన్: మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తి భవిష్యత్తును నాశనం చేస్తుందని వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ అన్నారు. నశా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వాసవీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాల మాయాజాలానికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మొదట మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో షెడ్డు ప్రారంభం



నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో కొలువైయున్న గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుమారుడు గిరిబాబు బుధవారం ప్రారంభించారు. షెడ్డు నిర్మాణానికి గిరిబాబు ఆర్థిక సాయం అందించిన విషయం విదితమే. బుధవారం ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను శాలువాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. గొట్టిపాటి శ్రీనివాసరావు, వేజెండ్ల శ్రీనివాసరావు, కమ్మ సీతయ్య, శివనాగేశ్వరరావు, హనుమంతరావు, నార్నె కిషోర్, యర్రంనేని శ్రీనివాసరావు, కాకతీయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన బుధవారం గణపవరం గ్రామం వద్ద చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు చిలకలూరిపేటకు చెందిన దమ్ము చంద్రశేఖర్ తన ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట వెళ్తున్నారు. పక్కనే వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం తగలటంతో చంద్రశేఖర్ వాహనం అదుపుతప్పి డివైడర్‌పై పడ్డాడు. గాయాలపాలైన చంద్రశేఖర్‌ను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి



నూజెండ్ల: లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఆర్ అండ్ బీ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. ఐనవోలు పోలీస్‌స్టేషన్ ఎస్సై కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం పమిడిపాడు గ్రామానికి చెందిన పూరపాటి వెంకట్రావు (46) వృత్తి రీత్యా ఆర్ఎంపీగా చేస్తుంటాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం వినుకొండకు వెళ్ళి వస్తుండగా ఉప్పలపాడు గురుకుల పాఠశాల సమీపంలోకి రాగానే నూజెండ్ల వైపు నుంచి వస్తున్న లారీ మూల మలుపు వద్ద ఢీ కొంది. ఘటనా స్థలంలోని వెంకట్రావు మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య కుసుమత, ఇరువురు సంతానం ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.2.40 లక్షల జరిమానా

నరసరావుపేట టౌన్: మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపినట్లు నేరం రుజువు అవడంతో పట్టణానికి చెందిన 24 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆవుల సలోమి బుధవారం తీర్పుచెప్పారు. మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 24 మంది వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారందరిపై కేసులు నమోదు చేసి నిందితులను బుధవారం కోర్టులో ప్రవేశపెట్టారు. నేరాన్ని అంగీకరించటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెలువరించారు.

బీరుసీసాలతో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

నాదెండ్ల: మద్యం దుకాణంలో బిహార్ కార్మికుడిపై బీరు సీసాలతో దాడి చేసిన ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గణపవరం గ్రామంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన ఉత్తమ్‌రౌత్ గణపవరం–వేలూరు రోడ్డులోని వైన్‌షాపులో సోమవారం రాత్రి మద్యం తాగుతున్నాడు. ఇదే సమయంలో గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు వాగ్వాదానికి దిగి బీరు సీసాలతో దాడి చేశారు. దీంతో తీవ్రగాయాలపాలైన ఉత్తమ్‌రౌత్‌ను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు బుధవారం నిందితులపై కేసు నమోదు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ



వినుకొండ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వినుకొండ, నూజెండ్ల మండలాల్లోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు బుధవారం శిక్షణ జరిగింది. ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకుడు సైదయ్య, ఏఈవో వరలక్ష్మి, జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ నందకుమార్ హాజరై ప్రతి రైతు అంతర పంటల విధానం ఆచరించాలని, దీని వలన రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలియజేశారు. ఆర్ఎస్‌కే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. వినుకొండ మండలాన్ని 9 క్లస్టర్లుగా విభజించి ఒక్కొక్క క్లస్టర్‌లో 125 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డివిజన్ మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, శివలక్ష్మి, యూనిట్ ఇన్‌చార్జి హనుమంతరావు, వేణుగోపాల్, కోటేశ్వరరావు, ధర్మతేజ పాల్గొన్నారు.

కోదండరామాలయ నూతన కమిటీ ఎన్నిక

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న కోదండరామాలయం నూతన కమిటీ బుధవారం ఏర్పాటైంది. 2023లో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో ఆలయాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయిన వెంటనే తొలి కమిటీ ఏర్పాటైంది. రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కాటా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా జంపని వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా గుర్రం ఆదినారాయణ, కోశాధికారిగా గాలి బుచ్చయ్య, జాయింట్ సెక్రటరీగా నార్నె శివ, గౌరవ అధ్యక్షులుగా కెల్లంపల్లి సుందరరావు, కాటా రత్తయ్యలతో కలిపి 21 మంది సభ్యులు ఎంపికయ్యారు. 15న ఆలయంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


ఉపాధి శ్రామికులను అక్షరాస్యులను చేయాలి



శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి శ్రామికులను అక్షరాస్యులను చేయాలని ఎంపీడీవో సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జాబ్‌కార్డు ఉన్న ఉపాధి శ్రామికుల్లో నిరక్షరాస్యుల వివరాలను ప్రత్యేక రిజిస్టరులోనూ, ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాలన్నారు. వచ్చే నెల 8 నుంచి వయోజన విద్య ద్వారా వయోజన శాఖ అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణలో నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయాలన్నారు. అనంతరం నమోదు చేయు ప్రతులను ఆవిష్కరించారు. మండల ఫీల్డ్ అసిస్టెంట్స్ అధ్యక్షుడు అన్నవరపు వెంకటేశ్వరరావు, వయోజన విద్యా శాఖాధికారి నాగేశ్వరరావు, టీఏలు ముత్యాలరాజు, సీసీ రామారావు పాల్గొన్నారు.

15న మాంసాహారం నిషేధం

మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్



వినుకొండ : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న శుక్రవారం పట్టణంలో మాంసాహారం నిషేధించడమైందని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. జంతువధ శాల మూసివేయడం జరుగుతుందని, మాంసం, చేపల వ్యాపారస్తులు, మటన్, చికెన్ స్టాల్స్ యజమానులు తమ దుకాణాలను మూసివేయాలన్నారు. అదేవిధంగా కిచిడీ హోటల్స్, రెస్టారెంట్స్‌లో మాంసాహార విక్రయాలు నిలిపివేయాలని సూచించారు. ఇందుకు భిన్నంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.